ప్రజాశక్తి
శనివారం 1, ఏప్రిల్ 2023 5 అనంతపురం



బాలుడిని కాపాడిన సిపిఎం నాయకులు

అనంపురం కలెక్టరేట్ : మహదేవనగర్ రైల్వే బ్రిడ్జి కింద ఉన్న వంకలో ప్రమాదవశాత్తు మునిగిపోతున్న బాలుడిని సమీప కాలనీలో నివసిస్తున్న సిపిఎం నాయకులు కాపాడారు. శుక్రవారం సాయంత్రం రుద్రంపేట హాస్టల్‌లో చదువుకుంటున్న మూగ, చెవిటి కలిగిన బాలుడు మహదేవ్ నగర్ వంకకు వచ్చాడు. ప్రమాదం పట్ల అవగాహన లేని బాలుడు నీటిలోకి దిగాడు. గమనించిన కాలనీవాసులు గమనించి నీట మునిగే సమయంలో కాపాడి బయటకు తీసుకొచ్చారు. వెంటనే ఉప సర్పంచి మసూద్, సిపిఎం నాయకులు బాబు, మూడవ పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. ఆ బాలుడికి భోజనం పెట్టి బాలుడి ఆచూకీ తెలుసుకునేందుకు యత్నించారు. అక్కడి చేరుకున్న పోలీసులు ఆరాతీయగా సాయినగర్‌కు చెందిన బాలుడిగా గుర్తించారు. తండ్రి లేడని, తల్లి ఉందన్నారు. రుద్రంపేటలోని హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వలి, వెంకటప్ప, వెంకటనారాయణ, పెద్ద మసూద్, షఫీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి సెల్వరాజన్

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి

వైఎస్ఆర్ జగనన్న బడుగు వికాసం రూ.651.63 లక్షల సబ్సిడీ మంజూరు

కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

ప్రజాశక్తి- అనంపురం కలెక్టరేట్

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్, ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పరిశ్రమల స్థాపనతోనే జిల్లా అభివృద్ధి చెందుతుందన్నారు. జిల్లాలో నూతన పరిశ్రమలు స్థాపించేందుకు పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సింగిల్ విండో పోర్టల్ నందు జనవరి, ఫిబ్రవరి మాసంలో 110 దరఖాస్తులు రాగా అందులో 93 దరఖాస్తులు నిర్దేశించిన గడువులోగా ఆమోదించబడ్డాయన్నారు. మిగిలిగిన 17 దరఖాస్తులను కూడా పెండింగ్ లేకుండా గడువు తేదీ లోపల ఆమోదించాలని జిల్లా కాలుష్య నియంత్రణ, పరిశ్రమలు, భూగర్భ జల శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జగనన్న బడుగు వికాసం కింద జిల్లాలో 42 యూనిట్లకు రూ.651.63 లక్షల సబ్సిడీ మంజూరుకు ఆమోదించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డిఎం నాగరాజారెడ్డి, డిసిఐఎఫ్ కేశవులు, ఎఫ్ఎపిసిసిఐ శేషాంజనేయులు, ఎఫ్ఎపిఎస్ఐఎ నాగరాజు, ఎపిఐఐసి జెడ్ఎం మురళీమోహన్, ఎపిఎస్ఎఫ్‌సి బ్రాంచి మేనేజర్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలలో పురోగతి సాధించాలి

గృహ నిర్మాణాలలో పురోగతి సాధించాలని, వేగవంతంగా ఇళ్ల నిర్మాణం చేపట్టాలని, కేటాయించిన లక్ష్యాలను చేరుకునేందుకు కృషి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని విసి హాల్ నుంచి ఇళ్ల నిర్మాణాలపై ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, హౌసింగ్ డీఈలు, ఏఈలు, క్షేత్రస్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలలో ఆశించినంతగా పురోగతి లేదన్నారు. నాట్ స్టార్టెడ్ నుంచి బిబిఎల్ స్థాయికి, బిబిఎల్ నుంచి బిఎల్ స్థాయికి, రూఫ్ లెవెల్ నుంచి ఆర్సీ స్థాయికి వచ్చేలా ఇళ్ల నిర్మాణంలో వెంటనే పురోగతి చూపించాలన్నారు. స్టేజి అప్డేట్లు ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. ఆయా మండలాల వారీగా ప్రతివారం కేటాయించిన లక్ష్యాలలో 50 శాతం కూడా చేరుకోవడం లేదని కలెక్టర్ అధికారులపై అసహనం వ్యక్తంచేశారు. లబ్ధిదారులకు సరైన అవగాహన కల్పించడం లేదన్నారు. ఈ విషయమై ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వార్డ్ అమినిటీలతో నిత్యం సమీక్షిస్తూ పురోగతిలోకి వచ్చేలా చూడాలన్నారు. ఏప్రిల్, మే మాసాలలో మాత్రమే పనులు పూర్తి చేసేందుకు అవకాశం ఉందన్నారు. అధికారులు సంబంధిత లైన్ డిపార్ట్‌మెంట్లతో సమన్వయం చేసుకుని వారం, వారం, కేటాయించిన లక్ష్యాలను పూర్తిగా చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ కేశవనాయుడు, జిల్లా పరిషత్ సీఈవో భాస్కర్‌రెడ్డి, ఎపి ఎస్‌పిడిసిఎల్ ఎస్ఇ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం 'పది'లం..

విద్యార్థుల ఉన్నత భవితకు పునాది పదోతరగతి. శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. అయితే మంచి మార్కులు సాధించాలంటే ప్రణాళికాబద్ధమైన ప్రిపరేషన్ తప్పనిసరి అంటున్నారు నిపుణులు. టెన్త్ ప్రశ్నపత్రంలో నమూల మార్పులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టగా, ఏప్రిల్ 3 నుంచి పరీక్షలు నిర్వహించనున్న నేపథ్యంలో ప్రజాశక్తి ప్రత్యేక కథనం..

టెన్త్ ఉత్తమ ఫలితాలపై ప్రత్యేక దృష్టి

ప్రభుత్వ పాఠశాలల్లో కసరత్తు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

విద్యార్థి దశలో తొలి పబ్లిక్ పరీక్షలు పదో తరగతితోనే ప్రారంభమవుతాయి. విద్యార్థి భవిత కూడా ఈ పరీక్షలపైనే ఆధారపడి ఉంటుంది. గతంలో ఆరు సబ్జెక్టుల్లో 11 పేపర్లకు పరీక్షలు నిర్వహించేవారు. కోవిడ్ కారణంగా 2020, 2021 సంవత్సరాల్లో పరీక్షలు నిర్వహించకుండానే పదోతరగతి విద్యార్థులను ప్రభుత్వం ఉత్తీర్ణులను చేసింది. గతేడాది సైన్స్ సబ్జెక్టులో రెండు పేపర్లు, మిగిలిన ఐదు సబ్జెక్టులకు ఒక్కో పేపరు వంతున మొత్తం 7 పేపర్లకు పరీక్ష నిర్వహించింది. ఈ ఏడాది ప్రతి సబ్జెక్టుకు ఒక పేపరు చొప్పున 6 పేపర్లు రాయాల్సి ఉంది. ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. పరీక్షల గడువు సమీపిస్తుండడంతో విద్యార్థులు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. తొలి పబ్లిక్ పరీక్షలు కావడంతో విద్యార్థులు ఒత్తిడికి గురికావడం సర్వసాధారణం. ఈ నేపథ్యంలో విద్యార్థులు ప్రణాళిక ప్రకారం చదివితే మంచి మార్కులు సాధించవచ్చని సబ్జెక్టు నిపుణులు చెబుతున్నారు

ధర్మవరం మున్సిపాల్టీలో 2510 మంది విద్యార్థులు ఈసారి టెన్త్ పరీక్షలు రాయనున్నారు. ఈ నేపథ్యంలో పాధ్యాయులు పదోతరగతిలో ఉత్తమ ఫలితాల సాధనకు విద్యార్థులను ఫైనల్ పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. రోజూ ఉదయం, సాయంత్రం రెండేసి గంటల పాటు అదనంగా తరగతులు నిర్వహిస్తూ విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్నారు. ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులు పాల్గొని సలహాలు, సూచనలు అందిస్తున్నారు. వెనుకబడిన వారిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. సమ్మెటివ్-1 పరీక్ష ఫలితాల్లో సాధించిన మార్కుల ఆధారంగా విద్యార్థులను గ్రూపులుగా విభజించి పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి తల్లిదండ్రులు ద్వారా వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు.



ధర్మవరం పాఠశాలలో స్టడీ అవర్స్ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ఉత్తమ ఫలితాలు సాధిస్తాం



ఈ ఏడాది టెన్త్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తాం. ధర్మవరం మండలం, మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ, ప్రయివేటు 31 ఉన్నత పాఠశాలల నుంచి 2510 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్నారు. ఇప్పటికే వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాం.

- సుధాకర్ నాయక్, ఎంఇఒ, ధర్మవరం

ప్రణాళికాబద్ధంగా..



ఉత్తమ ఫలితాలను సాధించేందుకు వీలుగా పదోతరగతి విద్యార్థులకు ప్రణాళికా బద్ధంగా శిక్షణ ఇస్తున్నాం. కార్పొరేట్, ప్రయివేటు పాఠశాలలకు దీటుగా విద్యాబోధన సాగిస్తున్నాం. వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. ఉత్తమ ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు **- ఉమాపతి, హెచ్ఎం, బిఎస్ఆర్ బాలికల ఉన్నత పాఠశాల**

ఒత్తిడి వద్దు..

పరీక్షలు సమీపిస్తుంటే కొందరు విద్యార్థులు ఒత్తిడికి గురవుతుంటారు. దీని వల్ల ప్రయోజనం ఉండదు. ప్రణాళికబద్ధంగా చదవాలి. కొందరు రాత్రంతా మెలకువగా ఉండి చదివేందుకు ప్రయత్నిస్తారు. దీని వల్ల ఆరోగ్య సమస్యలు వస్తుంటాయి. పిల్లల చదువు పట్ల తల్లిదండ్రులు కూడా శ్రద్ధ చూపాలి. అవకాశం ఉంటే సెల్‌ఫోన్లు టీవీలు బంద్‌చేసి పిల్లల పక్కన కూర్చుని చదివించాలి. ఎలాంటి ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్షలకు సిద్ధం కావాలి. మానసిక సంసిద్ధతతోనే సత్ఫలితాలు సాధించగలం.

- ఇందురేఖ, ప్రభుత్వ వైద్యురాలు

పది పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలి

డిఇఒ మీనాక్షి

త్వరలో జరగనున్న పది పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత శాతం సాధించేలా విద్యార్థులు చదుకోవాలని ఇన్‌ఛార్జి డిఇఒ మీనాక్షి సూచించారు. గురువారం రాత్రి ఆమె ధర్మవరంలో పదవ తరగతి విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి వారు ఎలా చదువుతున్నారో పరిశీలించారు. విద్యార్థులకు తల్లిదండ్రులు ప్రోత్సాహం అందించాలన్నారు. పరీక్షల సమయంలో ఆరోగ్యంగా ఉండాలని, తెల్లవారుజామున లేచి చదవాలన్నారు. టివిలు, సెల్‌ఫోన్లు చూడొద్దని విద్యార్థులకు సూచించారు. డిఇఒ వెంట బిఎస్ఆర్ బాలుర ఉన్నతపాఠశాల హెచ్ఎం రాంప్రసాద్ తదితరులు ఉన్నారు.



ఇంటి వద్ద విద్యార్థులతో మాట్లాడుతున్న డిఇఒ

స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఆధారంగా పంట నష్టపరిహారం చెల్లించాలి

3న మండల కార్యాలయాల వద్ద ధర్నా

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి- అనంపురం కలెక్టరేట్

మార్చి నెలలో జిల్లాలో వీచిన భారీ గాలులు, వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఆధారంగా నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. పంట నష్టపరిహారం ప్రకటించి రైతుల ఖాతాల్లో జమచేయాలని, సాగు చేసిన కౌలు రైతులకు పరిహారం అందేలా నిబంధనలు మార్చాలని డిమాండ్ చేస్తూ ఈనెల 3వ తేదీన జిల్లాలో అన్ని మండల కార్యాలయాల వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 16 మండలాల్లో 12,368 ఎకరాల్లో పంటలు దెబ్బతిని రైతులు కోట్ల రూపాయలు నష్టపోయారని తెలిపారు. పరిహారం నిర్ణయించడంలో నిబంధనల పేరుతో రైతులను ప్రభుత్వం దగా చేస్తోందని విమర్శించారు. అరటి ఎకరా సాగుకు రూ. లక్షా 30 వేల ఖర్చు కాగా బ్యాంకులు పంట పెట్టుబడి రుణం (స్కేల్ ఆఫ్ ఫైనాన్స్) కింద రూ.20 వేలు ఇస్తున్నారని తెలిపారు. హెక్టార్ అరటి పంటకు రూ.25 వేలు మాత్రమే పరిహారం అంచనా వేశారని తెలిపారు. బత్తాయి, మామిడి, మిరప, మొక్కజొన్న తదిర పంటల నష్టాన్ని నామమాత్రపు పరిహారంతో అంచనా వేశారని తెలిపారు. రైతులకు పయోగపడని నిబంధనలను వెంటనే సవరించి పంట పెట్టుబడి ఖర్చు, దిగుబడి ఆదాయం కలిపి పరిహారం చెల్లించాలన్నారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఆధారంగానైనా పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వాస్తవ సాగుదారులను గుర్తించి కౌలు రైతులకు పరిహారం అందించాలని, సాంకేతిక కారణాలతో రైతుల పేర్లు ఈ క్రాప్ బుక్కింగ్‌లో నమోదు కాకపోయిన వారికి కూడా పరిహారం ఇవ్వాలన్నారు. 3వ తేదీన తహశీల్దార్ కార్యాలయాల వద్ద నిర్వహిస్తున్న ధర్నాలో రైతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

వైసిపి ప్రభుత్వంలో బిసిలకు ఒరిగిందేమీ లేదు

యువగళం పాదయాత్రలో నారా లోకేష్



నారా లోకేష్‌కు గజమాలతో స్వాగతం పలుకుతున్న డిడిపి నాయకులు

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

వైసిపి ప్రభుత్వంలో బిసిలకు ఒరిగిందేమీ లేదని..జగన్ బిసిలను మాటలతో మభ్యపెడుతున్నాడని.. తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. శుక్రవారం యువగళం పాదయాత్ర చెన్నేకొత్తపల్లి మండలంలోని కోన క్రాస్ విడిది కేంద్రం నుంచి ప్రారంభమైంది. దేవరకొండ ప్రాంతంలోని జలాశయ ముంపు రైతులతో సమావేశం నిర్వహించారు. బిసిలతో భేటి అయ్యారు. యర్రంపల్లి వద్ద జాకీ పరిశ్రమ భూ బాధితులతో సమావేశమయ్యారు. నాగసముద్రం గేటు వద్ద ఆటో డ్రైవర్లు, మెకానిక్కులతో ముచ్చడించారు. నాగసముద్రం గ్రామంలో స్థానికులతో భేటి అయ్యారు. ఉప్పరవాండ్లపల్లి కొట్టాల వద్ద సత్యసాయి నీటి సరఫరా కార్మికులతో సమావేశమయ్యారు. ప్యాదిండి గ్రామ సమీపంలో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ.. జగన్ బిసిలకు అనేక పదవులిచ్చామని చెబుతూ వారిని మాటలతో మభ్యపెడుతున్నారన్నారు. వైసిపి ప్రభుత్వంతో కింది స్థాయి బిసిలకు న్యాయం జరగలేదన్నారు. స్థానిక సంస్థల్లో 10 శాతం రిజర్వేషన్లు వైసిపి ప్రభుత్వం తొలగించడంతో 16 వేల పదవులను బిసిలు కోల్పోయారన్నారు. టిడిపి స్థాపనతోనే బిసిలకు ఆర్థిక, రాజకీయ, సామాజిక స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. ఇచ్చిన ప్రతి హామీని అమలుచేసే బాధ్యతను తెలుగుదేశం ప్రభుత్వం తీసుకుంటుందని నారా లోకేష్ స్పష్టం చేశారు. బిసిలకు సంక్షేమ పథకాలను పక్కాగా అమలుచేస్తామని అన్నారు. సత్యసాయి నీటి సరఫరా కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎండను సైతం లెక్క చేయకుండా తనతో పాటు పాదయాత్రను ముందుకు సాగిస్తున్న ప్రతి కార్యకర్తకూ రుణపడి ఉంటామని చెప్పారు. వైసిపి నాయకులు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే అన్ని కేసులూ కొట్టివేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి సత్యసాయి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి, మాజీ మంత్రి పరిటాల సునీత, యువ నాయకులు పరిటాల శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

పరిటాల కుటుంబం ప్రజలతో మమేకమవుతుంది

మాజీ మంత్రి పరిటాల సునీత

పరిటాల కుటుంబం ప్రజలతో మమేకమవుతుందని మాజీ మంత్రి సునీత అన్నారు,. టిడిపి హయాంలో రాప్తాడు నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి నియోజకవర్గంలో అభివృద్ధి చేపట్టకపోగా.. ఉదయం లేచినప్పటి నుండి పరిటాల కుటుంబాన్ని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. విమర్శలు మాని నియోజగకవర్గ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. మేము సైతం అంటూ పరిటాల కుటుంబం వెంట ఉన్న ప్రతి కార్యకర్తకూ సునీత ధన్యవాదాలు తెలియజేశారు.

సెంట్రల్ వర్సిటీ ఎస్ఎఫ్ఐ నాయకులపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురము సెంట్రల్ యూనివర్సిటీ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) యూనిట్ కమిటీ నాయకులను ఐదుగురిని హాస్టల్ నుంచి సస్పెండ్ చేయడాన్ని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తోందని, వెంటనే సస్పెన్షన్ ఎత్తివేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతురు పరమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ విభజన హామీల్లో భాగంగా అనంతపురంలో ఏర్పాటైన సెంట్రల్ యూనివర్సిటీ సమస్యల నిలయాలుగా మారిందన్నారు. ఉన్న సమస్యలను పరిష్కరించాలని విద్యార్థుల తరుపున ఎస్ఎఫ్ఐ సెంట్రల్ యూనివర్సిటీ కమిటీ పలుమార్లు ప్రాంగణంలో ఆందోళనలు నిర్వహించిందన్నారు. ఈ మధ్య కాలంలో ఫైనల్ ఇయర్ విద్యార్థుల పరీక్ష ఫలితాల్లో జరిగిన అవకతవకల్లో యూనివర్శిటీ డీన్ పాత్రను తప్పుపడుతూ యూనిట్ కమిటీ విసికి ఇచ్చిన వినతిని యునివర్సిటీ గోడకు అంటించినందుకు ఐదుగురు ఎస్ఎఫ్ఐ నాయకత్వాన్ని హాస్టల్ నుంచి సస్పెండ్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. డీన్ పై చర్యలు తీసుకోవాలని విసి ఫిర్యాదు చేసిన వారిపై చర్యలకు పాల్పడటం హేయమైన చర్య అన్నారు. యూనివర్శిటీలో విద్యార్థి సంఘాలుకు మాట్లాడే స్వేచ్ఛను అధికారుల హరిస్తున్నరని వాపోయారు. వెంటనే సస్పెన్షన్ ఎత్తివేయాలని, లేని పక్షంలో ఆందోళనలు ఉదతం చేస్తామని హెచ్చరించారు.

అక్రమ కేసులు బనాయించడం అప్రజాస్వామికం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

ప్రభుత్వ మోటార్ల అక్రమ రవాణాను అడ్డుకున్న వారిపై అక్రమ కేసులు బనాయించడం అప్రజాస్వామికమని మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయచౌదరి అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజుల క్రితం శెట్టూరు మండలం చెర్లోపల్లి గ్రామంలో రైతులకు అందించిన మోటార్లను కొంతమంది అక్రమంగా తరలిస్తుంటే అడ్డుకున్న టిడిపి నాయకులు ఉన్నం మారుతీ, ఉన్నం ఉదయ్‌తో పాటు మరో పదిమందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు బనాయించడం బాధాకరమన్నారు. ఈకేసులను చూస్తుంటే స్థానిక మంత్రి ఎంత దిగుజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారో అర్థం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

తొలితరం మహిళా ఉద్యమ నాయకురాలు 'మోటూరు'

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

మహిళా హక్కుల కోసం పోరాడిన తొలితరం మహిళా ఉద్యమ నాయకురాలు మోటూరు ఉదయం నిలిచారని ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి అన్నారు. ఐద్వా జాతీయ మాజీ నాయకురాలు మోటూరు ఉదయం వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక సిపిఎం నూతన కాలనీలో శుక్రవారం ఐద్వా ఆధ్వర్యంలో చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మోటూరు ఉదయం జీవితమంతా మహిళల హక్కుల కోసం, సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించిన ఉక్కు మహిళా నాయకురాలు అన్నారు. బుర్రకథలో యావత్ రాష్ట్రాన్ని ఉర్రూత లూగించిన తొలి మహిళ అన్నారు. రాష్ట్రంలో మొట్ట మొదటి మెడికల్ సేల్స్ రెప్రజెంటేటీవ్‌గా పని చేసిన తొలి మహిళ అన్నారు. మహిళలకు మరుగుదొడ్ల సమస్యలు, మద్య పాన నిషేదం, మహిళలకు ఆస్తి హక్కు, సమానత్వం, మహిళా వ్యవసాయ కూలీలకు ప్రసూతి సెలవులు, అనాథ శరణాలయాల కోసం ఎనలేని కృషి చేశారని తెలిపారు. 1983లో ఎన్‌టి.రామారావు అధికారంలోకి వచ్చిన సందర్భంగా పెద్ద ఎత్తున మహిళల సమస్యల పరిష్కారం కోసం సభలు ఏర్పాటు చేసి ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్‌ని ఆహ్వానించారని గుర్తు చేశారు. ఆ సందర్భంగా మహిళల సమస్యలపై మోటురు ఉదయం ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌కు వినతిపత్రం అందజేశారని, ఆ డిమాండ్‌లు అన్నింటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. నేటి పాలకులు సమస్యలపై పోరాడే వారిపై కేసులు బనాయిస్తూ వేధింపులకు గురి చేస్తున్నారని, ఇలాంటి విధానం పోవాలని, స్వేచ్ఛా హక్కు, వాక్ స్వాతంత్ర్యం హక్కు కాపాడబడాలని కోరారు. మహిళలపై ఎక్కడో ఒక చోట దాడులు, హత్యాచారాలు చోటు చేసుకోవడం దారుణంగా ఉందన్నారు. మోటూరు ఉదయం పోరాట స్ఫూర్తితో మహిళలకు రక్షణ, హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా పోరాడుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు చంద్రకళ, మాబి, నసీమా, హేమలత, మున్ని, ప్రకాష్, బాబు, మసూద్ తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వర్యంలో నివాళి



మోటూరు ఉదయంకు నివాళులర్పిస్తున్న ఐద్వా నాయకురాళ్లు

అధ్యాపకులు బోధనా నైపుణ్యం పెంచుకోవాలి

జెఎన్‌టియు ప్రిన్సిపల్ పి.సుజాత

ప్రజాశక్తి-అనంతపురం

జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాలలో పని చేస్తున్న అధ్యాపకులు మారుతున్న సాంకేతికకు అనుగుణంగా బోధనా నైపుణ్యాలను పెంచుకోవాలని ప్రిన్సిపాల్ పి.సుజాత సూచించారు. శుక్రవారం స్థానిక కంప్యూటర్ సైన్స్ విభాగ అధిపతి ఎపి.శివకుమార్ అధ్యక్షతన ఇంట్రడక్షన్ టూ ఎంఎల్ఎన్ఎల్‌పి అండ్ చాట్ బోట్స్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇలాంటి శిక్షణ కార్యక్రమాల ద్వారాఉపాధ్యాయులు తమకున్న విజ్ఞానాన్ని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానికి అనుగుణంగా పెంపొందించుకోవడానికి, విద్యార్థులకు నూతన విషయాలను అర్థమయ్యేలా బోధించడానికి అనుకూలంగా ఉండాయన్నారు. ప్రతి ఉపాధ్యాయుడూ వృత్తి ధర్మం, నైపుణ్య అభివృద్ధి, వ్యక్తిత్వ వికాసాన్ని ఎప్పటికప్పుడు అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ ప్యాకల్టీ డెవలప్‌మెంట్ బి.ఈశ్వర్‌రెడ్డి, ఎ.సురేష్‌బాబు, బి.లలిత, కె.ఎఫ్.భారతి, వైస్ ప్రిన్సిపాల్ ఆర్.భవానీ, శిక్షణా కార్యక్రమం కోఆర్డినేటర్ బి.చెన్నారెడ్డి, పరిశ్రమలకు చెందిన వారు బి.ఉదయ్‌కిరణ్, షేక్ రహీముద్దీన్, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.


మౌనికను పరామర్శిస్తున్న మేయర్ వసీం

అమినిటీ కార్యదర్శికి మేయర్ పరామర్శ

అనంతపురం కార్పొరేషన్ : రోడ్డు ప్రమాదంలో గాయపడిన అమినిటీ కార్యదర్శి మౌనికను మేయర్ మొహమ్మద్ వసీం శుక్రవారం పరామర్శించారు. నగరపాలక సంస్థ 46వ సచివాలయంలో అమినిటీ కార్యదర్శిగా పని చేస్తున్న మౌనిక ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడడంతో స్థానిక సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న మేయర్ ఆసుపత్రికి వెళ్లి ఆమెను పరామర్శించారు. అమెకు మెరుగైన చికిత్స అందించాలని వైద్యులు గౌస్‌కు సూచించారు. ఆందోళన చెందవద్దని అన్నివిధాలా అండగా ఉంటామని భరోసా కల్పించారు. మేయర్ వెంట కార్పొరేటర్లు కమల్ భూషణ్, ఇషాక్, తదితరులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

రైతు, కార్మిక, ఉపాధి కూలీలకు మోడీ ప్రభుత్వం చేస్తున్న అన్యాయానికి వ్యతిరేకంగా ఈనెల 5న చేపడుతున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిధిలోని శీబాయి, గోళ్ల గ్రామాల్లో ఇందుకు సంబంధించిన కరప్రతాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు వ్యతిరేకంగా ఉన్న కార్మిక చట్టాలను రద్దు చేయడంతోపాటు కనీసం వేతనం రూ.26వేలు ఇవ్వాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఉపాధి కూలీలకు 200 రోజుల పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వర్కర్స్ యూనియన్ నాయకులు కొండారెడ్డి, మహానంది, రాము, తదితరులు పాల్గొన్నారు.


గుత్తిలో గోడపత్రికలు విడుదల చేస్తున్న సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు

గుత్తి : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంబిస్తోన్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఈనెల 5న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి వి.నిర్మల, రైతుసంఘం మండల కార్యదర్శి బి.రామకృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణ శివారులో ఉన్న జెడ్.వీరారెడ్డి కాలనీలో సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఇందుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం మతాలు, కులాలు, ప్రాంతాల పేరుతో ప్రజల్లో చిచ్చుపెట్టి పరిపాలన కొనసాగిస్తోందన్నారు. వాటిని నిరసిస్తూ ఈనెల 5న ఢిల్లీలో జరిగే కార్మిక, కర్షక పోరాట ప్రదర్శనలో పెద్దసంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షుడు ఎం.మల్లేష్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఎస్.మున్ని, కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.


కళ్యాణదుర్గం మండలంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

పైప్‌లైన్ లీకేజీ పనుల పరిశీలన

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలోని ఆజాద్ నగర్‌కు వెళ్లే పైపులైను లీకేజీ మరమ్మతు పనులను మేయర్ మొహమ్మద్ వసీం శుక్రవారం పరిశీలించారు. నడిమివంక వద్ద బ్రిడ్జి పనులు చేస్తుండడంతో ఆజాద్‌నగర్‌కు వెళ్లే పైపులైను లీకేజీ ఏర్పడింది. దీంతో ఆ ప్రాంతాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో పనులను పరిశీలించిన మేయర్ పూర్తి వివరాలను డిఇ నరసింహాను అడిగి తెలుసుకున్నారు. శుక్రవారం మధ్యాహ్నానికి మరమ్మతులు పూర్తి చేసి తాగునీటి సరఫరాను పునరుద్ధరించినట్లు డిఇ తెలిపారు. ఇందుకు మేయర్ స్పందిస్తూ నడిమి వంక వద్ద పనులు జరిగే సమయంలో లీకేజీల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తరచూ లీకేజీలు ఏర్పడటంతో పండుగ సమయాల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం కలగకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఇసాక్, రహంతుల్లా, కమల్ భూషణ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.


పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న మేయర్ వసీం

వైద్య పుస్తకాల వితరణ అభినందనీయం

మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ ఆరేపల్లి శ్రీదేవి

ప్రజాశక్తి-అనంతపురం

మెడికల్ కళాశాలలో సుమారు 20 సంవత్సరాలపాటు ఉపాధ్యాయుడిగా పనిచేసి అకాల మృతిచెందిన ఫార్మకాలజీ ట్యూటర్ సి.నాగరాజు జ్ఞాపకార్థం తన వైద్య విద్య పుస్తకాలను, పోస్ట్‌గ్రాడ్యుయేట్ పుస్తకాలను మెడికల్ కళాశాల సెంట్రల్ లైబ్రరీకి కొన్ని, ఫార్మకాలజీ విభాగాలకు వితరణగా అందజేయడం అభినందనీయమని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఆరేపల్లి శ్రీదేవి తెలిపారు. ఈమేరకు నాగరాజు తమ్ముడు, ఆర్డీటీ మానిటరింగ్ అండ్ ఎవల్యూషన్ డైరెక్టర్ హరినారాయణ శుక్రవారం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌కు పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా నాగరాజు మెడికల్ కళాశాలకు చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ముఖ్యంగా వైద్య విద్యార్థులకు తన అపారమైన జ్ఞానాన్ని అందించడంలో, సంస్కారాన్ని, మానవత్వపు విలువలను వారికి నేర్పడంలో ఆయన్ను మరువలేరన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రిన్సిపాల్, ఫార్మకాలజీ ప్రధాన విభాగాధిపతి షారోన్ సోనియా, ఫార్మకాలజీ సహాచార్యులు ఆశాలత, పద్మ శ్రావణి, అబ్దుల్ మజీద్, రియాజ్, కుష్బూ, పునర్జీవన్ కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు, ఆఫీసు సూపరింటెండెంట్ రవికుమార్, లైబ్రేరియన్ చంద్రశేఖర్, సిబ్బంది మల్లికార్జున, ఎన్ఎస్ఎస్ లీడర్లు స్వాతి, ప్రదీపిక, సాక్షి, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.


ప్రిన్సిపల్ శ్రీదేవికి పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

కామ్రేడ్ రంగన్న ఆశయాలను కొనసాగిస్తాం

ఉరవకొండ : దివంగత కమ్యూనిస్టు నాయకులు స్వర్గీయ కామ్రేడ్ తమ్మినేని రంగన్న ఆశయాలను కొనసాగిస్తామని ప్రవాసాంధ్రుడు, రంగన్న కుమారుడు తమ్మినేని రాజశేఖర్ స్పష్టం చేశారు. శుక్రవారం తమ్మినేని రంగన్న వర్ధంతిని పురస్కరించుకుని పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన రోగులు కూర్చోవడానికి 5 సిమెంట్ బల్లలు, వీల్‌ఛైర్‌ను అందించారు. అదేవిధంగా వేసవిని దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. తర్వాత రోగులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డా.చౌదరి, రాకెట్ల డాక్టర్ ఎర్రిస్వామి, ఆమిద్యాల పిఎసిఎస్ ఛైర్మన్ తేజోనాథ్, మాజీ ఎంపిపి ఎర్రిస్వామి, తిరుపాల్ శెట్టి, పెద్దవడుగూరు సూర్యనారాయణరెడ్డి, సిపిఎం నాయకులు మధుసూదన్, రంగారెడ్డి, జ్ఞానమూర్తి, ఆంజనేయులు, సిపిఐ నాయకులు మల్లికార్జున, చంద్రాయుడు, మనోహర్, టిడిపి తిమ్మప్ప, ఎంపిటిసి వన్నూరు సాబ్, రంగన్న అభిమానులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

రాయదుర్గం : రాయదుర్గం బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం శుక్రవారం ఎన్నికైంది. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎన్‌సి శ్రీనివాసన్, వన్నూరుస్వామి ఎన్నికయ్యారు. శుక్రవారం రాయదుర్గం కోర్టు ప్రాంగణంలో జరిగిన ఎన్నికల అధికారి రాజారావు సమక్షంలో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో 33 మంది అడ్వకేట్లు ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఇందులో ఒకటి చెల్లుబాటు కాలేదు. వీటిలో ఎన్‌సి శ్రీనివాసన్‌కు 29, ఎర్రిస్వామికి 3 ఓట్లు వచ్చాయి. అలాగే కోశాధికారిగా బి.మమత, ఉపాధ్యక్షులుగా జి.వెంకటరెడ్డి, సహాయ కార్యదర్శిగా పద్వీరాజ్, గౌరవాధ్యక్షులుగా ఎం. హనుమంతరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా లోకానంద, మల్లేశప్ప, రేణుక, నిర్మల, నరసింహారావు, జాన్సన్, శ్యామల, విజయరావు ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఆర్.టి జగన్మోహన్‌రెడ్డిని ఎన్నుకున్నారు.

గురుకుల పాఠశాల భవనాన్ని పూర్తి చేయాలి

రాయదుర్గం : గుమ్మగట్ట మండలం గోనబావి సమీపంలో ఉన్న గురుకుల పాఠశాల భవనాన్ని వెంటనే పూర్తి చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దాదాపుగా మూడు సంవత్సరాల కిందట భవన నిర్మాణ పనులను ప్రారంభించినా ఇప్పటికీ పూర్తి కాలేదన్నారు. దీంతో విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే పాఠశాల భవనాన్ని పూర్తి చేసి విద్యార్థులకు ఇబ్బందులను తొలగించాలని డిమాండ్ చేశారు.

పంచాయతీకి పెరిగిన ఆదాయం

నార్పల : మండల కేంద్రంలోని మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహించిన వివిధ వేలంపాటల్లో గతేడాది కంటే ఆదాయం పెరిగినట్లు ఇఓఆర్‌డి జి.లక్ష్మీనరసింహా తెలిపారు. బస్టాండు అప్పెట్ ఫ్రైస్‌కు నిర్వహించిన వేలంపాటలో రూ.4.5లక్షలకు పులిరాజు దక్కించుకున్నారు. అలాగే వారపు సంతను రూ.1.90లక్షలకు గోపాల్, మూత్రశాల, మరుగుదొడ్లను రూ.1.18లక్షలకు శివ దక్కించుకున్నారు. ఈ వేలాల ద్వారా గతేడాది కంటే ఈసారి రూ.1.7లక్షల ఆదాయం పెరిగినట్లు అధికారులు తెలిపారు.

ఏమొహం పెట్టుకుని లోకేష్ పాదయాత్రకు వచ్చాడు

టిడిపి చేతగానితనంతోనే 'జాకీ' దూరం - మహిళలు ఆర్థికంగా ఎదగాలి - 'ఆసరా'లో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

టిడిపి యువనేత నారా లోకేష్ ఏమొహం పెట్టుకుని రాప్తాడు నియోజకవర్గంలో పాదయాత్రకు వస్తున్నాడని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం రాప్తాడు సమీపంలోని జాకీ పరిశ్రమ స్థలంలో ఆసరా వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోసం చేయడమే టిడిపిఇ జెండా, అజెండా అన్నారు. రూ.140 కోట్ల విలువజేసే 28 ఎకరాల భూమిని కేవలం రూ.3 కోట్లకు ఇదే స్థలాన్ని జాకీ పేరుతో ఫేజ్ ఇండస్ట్రీస్ కంపెనీకి కట్టబెట్టారని ధ్వజమెత్తారు. ఈ ఫేజ్ ఇండస్ట్రీస్ సంస్థ చంద్రబాబు, లోకేష్‌కు బినామీ సంస్థ అన్నారు. 2016లో పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్న లోకేష్ ఈ భూములను ఇచ్చి 2018 నాటికి ఫ్యాక్టరీ నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. మీకు చిత్తశుద్ధి ఉంటే ఇప్పటికైనా పరిశ్రమను ఏర్పాటు చేయాలని, లేకుంటే తమకు భూమి అప్పగిస్తే తామే పరిశ్రమ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ పరిశ్రమ వస్తే 6 వేలమంది మహిళలకు ఉపాధి కల్పించవచ్చన్నారు. అలాగే పరిటాల సునీత పచ్చ మీడియాలో అవాకులు, చవాకులు పేలితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. పేరూరు డ్యాంకు నీళ్లిస్తామని చెప్పి రూ.1100 కోట్లతో టెండర్లు పిలిచి దోపిడీకి పాల్పడ్డావన్నారు. ఒక్క రూపాయి ప్రభుత్వం నుంచి తీసుకోకుండా మూడేళ్లుగా పేరూరు డ్యాంకు నీళ్లిస్తున్నామన్నారు. వీటితోపాటు బోర్లు వేయించి రైతుల కళ్లల్లో ఆనందం చూస్తున్నామన్నారు. నియోజకవర్గంలో 10 వేలమంది పాడి మహిళా రైతుల కోసం డెయిరీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతరం అనంతపురం రూరల్, రాప్తాడు మండలాలకు సంబంధించి రూ.16,60,63,116 కోట్ల మెగాచెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైసిపి జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, డిఆర్‌డిఎ పీడీ నరసింహారెడ్డి, అనంతపురం రూరల్, రాప్తాడు మండలాల నుంచి మహిళలు భారీ ఎత్తున తరలివచ్చారు.


సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

గార్లదిన్నె : మహిళల అభివృద్ధి, సాధికారతే సిఎం జగనన్న ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జొన్నగడ్డ పద్మావతి అన్నారు శుక్రవారం మండల పరిధిలోని కల్లూరు వైఎల్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో మూడో విడత వైఎస్‌ఆర్ ఆసరా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని జగనన్న ప్రభుత్వం మునుపెన్నడూ లేనివిధంగా మహిళల అభివృద్ధి కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. ఇందులో భాగంగానే గార్లదిన్నె మండలంలో 928 సంఘాల్లోని 9118 మంది మహిళా సంఘం సభ్యులకు రూ.7.65 కోట్ల ఆసరా వచ్చిందన్నారు. అనంతరం మహిళలకు మెగాచెక్కు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ నరేంద్ర, మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ నారాయణరెడ్డి, ఎంపిపి వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి : విప్ కాపు

ప్రజాశక్తి-రాయదుర్గం

పురపాలక మండలి సభ్యులు ప్రజలకు మెరుగైన సేవలు అందించి మంచి పేరు తీసుకురావాలని విప్ కాపు రామచంద్రారెడ్డి సూచించారు. పురపాలక సంఘం అధ్యక్షురాలు పోరాళు శిల్ప అధ్యక్షతన శుక్రవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో 32 వార్డులకు సంబంధించి ప్రతివార్డుకూ 5 చొప్పున వీధిదీపాలు ఏర్పాటు చేసేందుకు వ్యక్తిగతంగా తాను సాయం చేస్తున్నట్లు తెలిపారు. అంతేకాక ఎక్కడైనా విద్యుత్, ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకొస్తే ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా పట్టణంలో వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు విద్యుత్ మోటార్లు మరమ్మతులు చేసే కాంట్రాక్టర్‌తో ఇప్పటికే చర్చించినట్లు తెలిపారు. 2021లో సీఎం జగన్ రాయదుర్గం పర్యటన సందర్భంగా బిఆర్‌జిఎఫ్ నిధుల నుంచి వాడుకున్న రూ.13 లక్షలను కలెక్టర్‌తో చర్చించి వెనక్కి తెప్పిస్తామన్నారు. అలాగే పట్టణంలో వివిధ అభివృద్ధి పనుల కోసం మంజూరైన నిధులను ఆయా వార్డు సభ్యులు దగ్గరుండి నాణ్యతగా పనులు చేయించాలని సూచించారు. పురపాలక సంఘ అధ్యక్షులు పోరాల శిల్ప మాట్లాడుతూ గతంలో కొన్ని వార్డుల్లో చేసిన పనులకు బిల్లులు చెల్లించలేదన్నారు. ఇందుకు విప్ కాపు మాట్లాడుతూ గతంలో చేసిన పనులకు ఇంజినీరింగ్ అధికారులు బిల్లులు మంజూరు చేయకపోతే తదుపరి కౌన్సిల్ సమావేశంలో సంబంధిత అధికారులపై చర్యలు తీసుకునేందుకు కౌన్సిల్లో తీర్మానం చేయిస్తామన్నారు. అనంతరం మున్సిపల్ కూరగాయల మార్కెట్ మొదటి అంతస్తు షాపు రూముల వేలం జరిపేందుకు, పాత మున్సిపల్ కార్యాలయ స్థానంలో గుడ్ విల్ పద్ధతిన కొత్త వాణిజ్య సముదాయం నిర్మించేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఆజెండాలోని అన్ని అంశాలకు కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్‌ఛైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, వలిబాషా, మున్సిపల్ ఇంజినీర్ రామమూర్తి, వార్డు సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

71 మంది ఉద్యోగాలకు ఎంపిక

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు అనుబంధ కళాశాల ఒటిపిఆర్ఐ డైరెక్టర్ బి.దుర్గాప్రసాద్ అధ్వర్యంలో శుక్రవారం ఇండియన్ హెల్త్ కేర్ బిపిఓ చెన్నై వారు మెడికల్ కోడింగ్, మెడికల్ బిల్లింగ్ ఉద్యోగాలకు నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో 71 మంది ఎంపికయ్యారు. 2022 -23 విద్యా సంవత్సరానికి వరుసగా మూడవసారి ఒటిపిఆర్ఐ ప్రాంగణ నియామకాల ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఇండియన్ హెల్త్ కేర్ బిపిఓ సంస్థ సిఇఒ జె.శ్రీధర్, హెచ్‌ఆర్ మేనేజర్ శ్రీధర్ విద్యార్థులకు రాత పరీక్షతోపాటు ముఖాముఖి నిర్వహించారు. ఇందులో బీ.ఫార్మసీ, ఎం.ఫార్మసీ చివరి సంవత్సరం విద్యార్థులు 80 మంది పాల్గొనగా 71 మంది ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సి.గోపీనాథ్, ప్రాంగణ నియామకాల కోఆర్డినేటర్ ఎం.మహేష్, ఇ.పవన్, బోధన సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-అనంతపురం

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని వెల్ఫేర్ డైరెక్టర్ ఎస్.అబ్దుల్‌రసూల్ తెలిపారు. శుక్రవారం స్థానిక జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ విభాగంలో మెకానికల్ విభాగ అధిపతి కళ్యాణి రాధ అధ్యక్షతన మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్ (మత్తు మందు) అలవాటు కాకూడదన్నారు. ముఖ్యంగా 16 నుంచి 26 ఏళ్ల వయస్సులు యువత జాగ్రత్తగా ఉండాలన్నారు. అలాగే దేశవ్యాప్తంగా 1.73 కోట్ల మొబైల్ ఫోన్లకు బానిసైన వారు చికిత్స తీసుకుంటున్నారన్నారు. ఫోన్ల వల్ల చాలామంది ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. కావున మత్తుపదార్థాలతోపాటు సెల్‌ఫోన్లకు కూడా దూరండా ఉండానలి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కెయు కె.వరలక్ష్మి, ప్రభుత్వ వైద్యశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ వరదరాజులు, డ్రగ్ డీ ఆడిక్షన్ సెంటర్ సురేష్, ఎంటెక్, బిటెక్ విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల తనిఖీ

ప్రజాశక్తి-గుత్తి

మండలంలోని రజాపురం గ్రామ సమీపంలో ఉన్న బాలికల గురుకుల పాఠశాల వసతి గృహాన్ని ఎస్ఎఫ్ నాయకులు శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు సి.రమేష్, మండల కార్యదర్శి గౌతం నాయక్ మాట్లాడుతూ పుట్టపర్తి జిల్లా చిలమత్తూరు మండలంలో ఉన్న టేకూరు గురుకుల బాలికల వసతి గృహంలో గురువారం 8వ తరగతి విద్యార్థిని అనారోగ్యంతో మతి చెందిందన్నారు. ఆ హాస్టల్లో వారం రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థిని గురించి తల్లిదండ్రులకు సమాచారం అందించలేదన్నారు. ఈనేపథ్యంలో ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతిచెందిందని తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. వసతి గృహంలో ఎవరైనా విద్యార్థినులు అనారోగ్యానికి గురైతే వెంటనే తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శివ, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నేరాలు ఘోరాలు

గుజిరీ వ్యాపారి ఆత్మహత్య

నార్పల : మండల కేంద్రంలోని దుగుమర్రి రోడ్డులో గుజిరీ దుకాణం నిర్వహిస్తున్న వ్యాపారి సుబహాన్ (40) గురువారం రాత్రి గుజిరీలోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య హసీనా తెలిపిన వివరాల మేరకు.. సుబహాన్ రెండు, మూడు సంవత్సరాల నుంచి అప్పులు అధికం కావడంతో తీవ్ర మానసిక వేదనకు గురయ్యేవాడు. ఈనేపథ్యంలో గురువారం రాత్రి దుకాణంలోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతునికి భార్య హసీనా, కుమారుడు, కూతురు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు సిఐ అస్రార్‌బాషా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైల్లో నుంచి జారిపడి వ్యక్తి మృతి

గుత్తి : రైలులో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడిన ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన పట్టణంలోని ప్యాపిలి రైల్వే గేట్ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. జిఆర్పీ ఎస్ఐ నాగప్ప, కానిస్టేబుల్ వాసు తెలిపిన వివరాల మేరకు.. పత్తికొండ మండలం జూటూరు గ్రామానికి చెందిన రంగస్వామి (30) అలియాస్ రంగప్ప కూలి పనుల నిమిత్తం కడపకు వెళ్లేందుకు రైలు ఎక్కాడు. రైలు బోగిలోని డోర్ వద్ద నిల్చోని ఉండగా ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడ్డాడు. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనపై జిఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అశోక్ లాడ్జిలో అగ్నిప్రమాదం

అనంతపురం : నగరంలోని కమలానగర్‌లో మార్కెట్ వద్ద ఉన్న అశోక్ లాడ్జిలో శుక్రవారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. వెంటనే స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందజేయడంతో మంటలను అదుపు చేశారు. లాడ్జికి పక్కభాగంలో ఉన్న ఫైబర్ ప్లాస్టిక్ కేబుల్ వైర్లు కాలిపోవడంతో లాడ్జికి ఒకవైపుగా పెద్ద ఎత్తున మంటలు ఎగిసి పడ్డాయి. అక్కడే కరెంటు స్తంభాలు పెద్ద ఎత్తున విద్యుత్తు వైర్లు ఉండడంతో మంటలు బిల్డింగ్ పై వరకు వ్యాపించడంతో చుట్టుపక్కల వారు ఆందోళన చెందారు. అయితే అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన చేరుకుని మంటలను ఆర్పడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదంలో దాదాపుగా రూ.5 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు లాడ్జి సిబ్బంది తెలిపారు.

హత్య కేసులో వ్యక్తికి జీవిత ఖైదు

అనంతపురం : రాయదుర్గం పోలీసుస్టేషన్ పరిధిలో 20 నెలల కిందట జరిగిన హత్య కేసులో వ్యక్తికి జీవిత ఖైదు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ అనంతపురం 7వ అదనపు జిల్లా జడ్జి కోర్టు జడ్జి తిరుమలరావు తీర్పు వెలువరించారు. వివరాలు ఇలా ఉన్నాయి... మల్కాపురం గ్రామానికి చెందిన గోపాల్ 2021 జూన్ 7న హత్యకు గురయ్యారు. మద్యం తాగే విషయంలో గోపాల్, శ్రీనివాసుల మధ్య ప్రారంభమైన గొడవ హత్య వరకు దారితీసింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి అప్పటి సి.ఐ ఈరన్న అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టి సమగ్ర నివేదికను కోర్టుకు సమర్పించారు. విచారించిన అనంతపురం 7 వ అదనపు జిల్లా జడ్జి కోర్టు జడ్జి తిరుమలరావు శ్రీనివాసులుకు జీవిత ఖైదు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. ఈ కేసు సమగ్రంగా దర్యాప్తు చేసిన సి.ఐ ఈరన్న, ఎపిపి నాగరాజు బాబు, కళ్యాణదుర్గం కోర్టు కానిస్టేబుల్ కష్ణమోహన్‌ను, ఈ కేసులో నిందితుడిని, సాక్ష్యులను విధిగా కోర్టు ముందు హాజరు పరిచి తీర్పు వెలువడేందుకు కృషి చేసిన కళ్యాణదుర్గం డీఎస్పీ బి.శ్రీనివాసులను ఎస్పీ ఫక్కీరప్ప కాగినెల్లి అభినందించారు.

చరవాణితో పరిచయం పెంచుకుని మోసాలు

పెద్దవడుగూరు : తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌కు చెందిన మాదశివ గాయిత్రి అలియాస్ దీపికనయనితో అనంతపురం జిల్లా కూడేరు మండలం ఎంఎం.పల్లికి చెందిన సాం.మల్లికార్జున, గుజ్జల మురళీతోపాటు మరో ఇద్దరు వ్యక్తులు చరవాణి ద్వారా పరిచయం పెంచుకుని ఈనెల 25న నకిలీ బంగారు నాణేలు అంటగట్టిన కేసులో శుక్రవారం ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఇన్‌ఛార్జి సీఐ చిన్న పెద్దయ్య, ఎస్ఐ రాజశేఖరరెడ్డి తెలిపారు. ఈమేరకు శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నిందితులు సాకే మల్లికార్జున, గుజ్జల మురళీతో పాటు మరో ఇద్దరు వ్యక్తులు తాము పాత ఇళ్లు పడగొట్టే సమయంలో బంగారు నాణేములు దొరికాయని, వాటిని మార్కెట్ ధర కంటే తక్కువ ధరకు అమ్ముతామని నమ్మించి రెండు బంగారు నాణ్యమైన నాణేలు చూపించారు. వాటిని చూసిన ఆమె తనకు 200 బంగారు నాణేలు కావాలని కోరింది. దీంతో కాశేపల్లి సమీపంలో ఉన్న గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల వద్దకు పిలిపించుకుని బంగారు నాణేలు ఆమెకు అందజేయగా అవి నకిలిలా ఉన్నాయని అనుమానం వ్యక్తం చేయగా వెంటనే నిందితులు కత్తితో ఆమెను ఆమెతోపాటు వచ్చిన వ్యక్తులను బెదిరించి నగదుతో పారిపోయారు. మోసపోయిన బాధితులు పెద్దవడుగూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ గాలింపు చర్యలు చేపట్టిన ఎస్ఐ రాజశేఖరరెడ్డి నిందితుల చరవాణి ఆధారంగా మండలంలోని మిడుతూరు బస్టాండ్ వద్ద అరెస్టు చేసి రూ.1.5లక్షల నగదు, 200 నకిలీ నాణేలు, మూడు చరవాణిలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి తీవ్రగాయాలు

ఉరవకొండ : రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి తీవ్రగాయాలైన ఘటన శుక్రవారం ఉమండలంలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల మేర కు.. ఉరవకొండ పాతపేటలో నివసిస్తున్న 15 మంది కూలీలు ఆటోలో మండల పరిధిలోని ఆమిదాల గ్రామానికి కూలి పనులకు వెళ్లారు. పనులు ముగించుకుని తిరిగి వస్తుండగా వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో నాగిరెడ్డి, వన్నూరప్పకు తీవ్ర గాయాలయ్యాయి. సుహాసిని, యర్రమ్మ, సరస్వతికి స్వల్ప గాయాలకు గురికావడంతో 108, ఆటోలో ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మట్టి పెల్లలు పడి కూలీకి..

గుత్తి : మండలంలోని బసినేపల్లి గ్రామంలో మట్టి పెల్లలు మీద పడి కూలీ రంగయ్యకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. బసినేపల్లి గ్రామానికి చెందిన రంగయ్య కూలీ పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. ఇందులో భాగంగానే శుక్రవారం ఉదయం కూలి పనులకు వెళ్లాడు. ట్రాక్టర్ల లో మట్టి లోడ్ చేస్తుండగా ఒక్కసారిగా మట్టి పెల్లలు మీద పడి మట్టిలో కూరుకుపోయాడు. గమనించిన తోటి కూలీలు రంగయ్యను బయటకు తీసి చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

3153 మెట్రిక్ టన్నుల పప్పుశనగ కొనుగోలు

అనంతపురం : ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన పప్పుశెనగ సేకరణ సెంటర్ల ద్వారా రైతుల నుంచి 3153 మెట్రిక్ టన్నుల పంటను కొనుగోలు చేసినట్లు మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ గీత తెలిపారు. శుక్రవారం జిల్లాలోని రైతు భరోసా కేంద్రాల వారీగా రైతులను మ్యాపింగ్ చేశారు. పేర్లు నమోదు చేసుకున్న రైతులు సాగు చేసిన పప్పుశెనగ పంటను కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 1493 రైతులు నుంచి కొనుగోలు చేసిన పప్పుశెనగకు రూ.8.12 కోట్ల నిధులు అవసరమని నాఫెడ్‌కు సమాచారం పంపినట్లు తెలిపారు. ప్రారంభంలో కొనుగోలు చేసిన 204 మంది రైతులకు నిధులు చెల్లించినట్లు తెలిపారు.

ఘనంగా రథోత్సవం

రాయదుర్గంరూరల్ : మండల పరిధిలోని డీ. కొండాపురం గ్రామంలో ఆంజనేయ స్వామి రథోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథోత్సవంలో భక్తులు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు.

రోడ్డు పనులకు భూమిపూజ

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని వేపరాల గ్రామం నుంచి ఆదిగానిపల్లి మీదుగా కనేకల్ వరకు నిర్మించనున్న రోడ్డు పనులకు విప్ కాపు రామచంద్రారెడ్డి శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో కదరంపల్లి బాబులు, తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల వేలం

యాడికి : ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన 14 ద్విచక్ర వాహనాలకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సిఐ రామకృష్ణ, ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం వేలంపాట నిర్వహించినట్లు ఎస్ఐ అంబటి గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ వేలంపాటలో ప్రజలు, పలువురు మెకానిక్‌లు పాల్గొని వాహనాలను దక్కించుకున్నారు.